క్లుప్తంగా

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులకు క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో గురువారం రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ జట్టుకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. 44వ సబ్ జూనియర్ నేషనల్ షూటింగ్ బాల్ పోటీలకు పాఠశాల నుంచి అశ్వసాయి తేజ, ఉమేష్, యశ్వంత్ ఎంపికైయ్యారని తెలిపారు. ఈ నెల 22 నుంచి 24 వరకు బిహార్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. కార్యక్రమంలో పీడీ నసీరుద్దీన్, రాష్ట్ర షూటింగ్ బాల్ సెక్రటరీ ఐలయ్య, జిల్లా క్రీడల యువజన శాఖ అధికారి జ్యోతి పాల్గొన్నారు.

అమ్మాయిలకు అండగా షీటీం



గూడూరు: చదువుకునే అమ్మాయిలకు రక్షణగా షీటీం పోలీసులు పనిచేస్తారని గూడూరు సీఐ సూర్యప్రకాశ్ అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల విద్యాలయంలో గురువారం షీటీం ఆధ్వర్యంలో విద్యార్థినులకు లైంగిక వేధింపులు, సైబర్ నేరాలు, బాలికలపై జరుగుతున్న నేరాలపై ఏర్పాటు చేసిన అవగాహన కల్పించారు. షీటీం బృందం, కళాజాత ప్రదర్శకులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలను పూజించాలి



మహబూబాబాద్ అర్బన్: పర్యావరణ పరిరక్షణకు వినాయక నవరాత్రుల్లో మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌నాయక్ పిలుపునిచ్చారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కళాశాల అధ్యాపక బృందం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ప్రిన్సిపాల్ లక్ష్మణ్ నాయక్ మాట్లాడారు. రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలతో పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు అనిల్ కుమార్, మసూద్ అహ్మద్, రాజశేఖర్, సాంబశివరావు, వినోద్, శ్రీనివాస్, హతిరామ్, ఖాసీం షా, సుమాన్ పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

మరిపెడ రూరల్: ఉపాధ్యాయులు, ఉద్యోగుల జీవితాల్లో గుదిబండగా ఉన్న సీపీఎస్‌ను తక్షణమే రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాయిపెల్లి యాకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మరిపెడ మండలం చిల్లంచర్ల కాంప్లెక్స్ హెచ్‌ఎం మంద జయతో కలిసి సెప్టెంబర్ 1న ఇందిరా పార్క్ వద్ద తలపెట్టే మహాధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కవిత, శ్రీనివాస్, రవీంద్రకుమార్, శ్యామ్సన్ సుధాకర్, శ్రీకాంత్, శ్రీధర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలి

తొర్రూరు రూరల్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకుడు, ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీఫ్లోర్‌లీడర్ మంగళపల్లి శ్రీనివాస్ కోరారు. నాంచారీమడూరు గ్రామంలో ఇటీవల అంబేడ్కర్ విగ్రహానికి ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఇనుప స్టాండ్‌ను గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుంటుక యాదలక్ష్మి, మాజీ ఎంపీటీసీ కుంభం సునక్యరెడ్డి, నాయకులు కుమారస్వామి, కృపాకర్‌రెడ్డి, రమణ, రమేష్ పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

మరిపెడ రూరల్: పరిసరాలతోపాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తేనే సంపూర్ణమైన ఆరోగ్యం కలుగుతుందని మరిపెడ పీహెచ్‌సీ వైద్యాధికారి గుగులోతు రవి అన్నారు. గురువారం మరిపెడ మండలం ఆనెపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జన వికాస సంస్థ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరం ద్వారా 200 మందికి పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ రవి మాట్లాడుతూ ప్రజలకు పలు ఆరోగ్య సూత్రాలను వివరించారు. ఏఎన్‌ఎంలు కీర్తి, ఎంఎల్‌హెచ్‌పీ సౌజన్య, సంస్థ మేనేజర్ ఉపేంద్ర, కోఆర్డినేటర్ జుజ్జూరి ఉపేంద్ర, సిబ్బంది నర్సయ్య, ఆశ కార్యకర్తలు పార్వతమ్మ, పుష్ప, భార్గవి, కైక, సునీత, విజయ, లక్ష్మి, ధనలక్ష్మి, నసీమా పాల్గొన్నారు.

సమన్వయ లోపం.. ప్రజలకు శాపం

- పూర్తి కాని బ్రిడ్జి నిర్మాణం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



బ్రిడ్జి వద్ద ఏర్పడిన గుంతలు, బురద

మహబూబాబాద్ రూరల్ : ప్రభుత్వం, వివిధ శాఖల మధ్య సమన్వయలోపం ప్రజలకు శాపంగామారింది. మహబూబాబాద్ మండలంలోని జంగిలిగొండ, వీఎస్.లక్ష్మీపురం, సింగారం, గుండంరాజుపల్లి, వంతడుపుల, నర్సింహులపేట గ్రామాలకు వెళ్లేదారిలో నిర్మిస్తున్న బ్రిడ్జి పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. 2021 మే 5వ తేదీన అప్పటి ఎమ్మెల్యే శంకర్‌నాయక్ మండలంలోని జంగిలిగొండ క్రాస్ రోడ్డు వద్ద నుంచి నర్సింహులపేట క్రాస్ రోడ్డు వరకు 7.2 కిలో మీటర్ల మేర నూతనంగా నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. డీఎంఎఫ్ నిధులు రూ.4.50 కోట్లతో బీటీ పనులు చేపట్టగా ఆ పనులు నత్తనడకన కొనసాగుతూ బీటీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తికాగా.. జంగిలిగొండ క్రాస్ రోడ్డు సమీపంలో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు మాత్రం పూర్తికావడంలేదు. మహబూబాబాద్ మండలంలోని జంగిలిగొండ, వీఎస్.లక్ష్మీపురం, సింగారం గ్రామాలతోపాటుగా గుండంరాజుపల్లి, వంతడుపుల, నర్సింహులపేట గ్రామాల ప్రజలు బ్రిడ్జి నిర్మాణం కోసం ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉండగా.. బ్రిడ్జికి సమీపంలోనే విద్యుత్ స్తంభం ఉండడం.. విద్యుత్ తీగలు రోడ్డుకు ఇరువైపులా వెళ్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

అంబులెన్స్ రాలేని దుస్థితి



ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంవల్ల పనుల్లో జాప్యం జరుగుతోంది. బురద రోడ్డుతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్తున్నాం. గుంతల్లో వాహనాలు పడడంతో గాయాలపాలవుతున్నాం. స్కూల్, ఆర్టీసీ బస్సులు, 108 అంబులెన్సు రాలేని పరిస్థితి ఏర్పడింది.

– నలమాస సుధాకర్, జంగిలిగొండ

మల్యాలలోనే ఉద్యాన కళాశాల ఏర్పాటు చేయాలి

- ఎమ్మెల్యే మురళీనాయక్



వినతిపత్రం ఇస్తున్న మల్యాల గ్రామస్తులు

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని మల్యాల గ్రామంలోనే ఉద్యాన కళాశాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మల్యాలలోనే ఉద్యాన కళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని ఎమ్మెల్యే మురళీనాయక్ ఆధ్వర్యంలో ఉమ్మడి మల్యాల గ్రామ పెద్దలు గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీ నాయక్ మాట్లాడుతూ మల్యాల గ్రామంలో ఏర్పాటు కావాల్సిన ఉద్యాన కళాశాలను కొంత మంది ఇక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలించేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. కళాశాల ఏర్పాటుకు కావాల్సిన స్థలం ఉందని తెలిపారు. స్పందించిన ప్రభుత్వ సలహాదారులు నరేందర్ రెడ్డి ఉన్నతాధికారులతో మాట్లాడి మల్యాలలో కళాశాల కోసం స్థలాన్ని పరిశీలించాలని, అక్కడ నుంచి మరోచోటుకు మార్చకూడదని ఆదేశించారు. కార్యక్రమంలో వెన్నం శ్రీకాంత్ రెడ్డి, ఆవుల వెంకన్న, వీరన్న, ముత్తయ్య, మహబూబ్ పాషా, వెంకన్న, శేఖర్, దాము, రమేష్, చిమ్నా తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బూత్‌స్థాయిలో బలోపేతం చేయాలి

- రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్యామ్‌సుందర్‌శర్మ



అభివాదం చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

మహబూబాబాద్ అర్బన్: రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీజేపీని బూత్‌స్థాయిలో కార్యకర్తలు బలోపేతం చేయాలని ఆ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్యామ్‌సుందర్‌శర్మ, పట్టణ అధ్యక్షుడు వెన్నమల్ల అజయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పాతబజారు హనమంతునిగడ్డలో 223 బూత్ అధ్యక్షుల ఎన్నికలు గురువారం నిర్వహించారు. బూత్‌స్థాయి అధ్యక్షురాలిగా లక్ష్మీప్రియాంక, ఉపాధ్యక్షుడిగా తాళ్ల సతీష్, కార్యదర్శి బోయిన స్వాతిని సన్మానించారు. పెద్దబోయిన రవికుమార్ యాదవ్, నరేష్ నాయక్, సుధాకర్, శ్రీనివాస్, భీష్మాచారి, లింగన్న, రమేష్, స్వరూప, రజిత, శ్రీలత పాల్గొన్నారు.

నియామకం

పెద్దవంగర/తొర్రూరు: పెద్దవంగర మండలంలోని బొమ్మకల్లు గ్రామానికి చెందిన రంగు రాములు, తొర్రూరుకు చెందిన పల్లె కుమార్‌ను జనగామ బీజేపీ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ ఉత్తర్వులు జారీ చేశారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న మాస్‌లైన్ నాయకులు

దంతాలపల్లి/బయ్యారం/గంగారం/తొర్రూరు: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను వేగవంతం చేసి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని ఎంఎల్ మాస్ లైన్ నాయకులు అన్నారు. గురువారం పలు మండలాల్లో మాస్ లైన్ నాయకులు ఎంపీడీఓ కార్యాలయంలో వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ మహబూబాబాద్ డివిజన్ కార్యదర్శి పూనెం ప్రభాకర్, తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముంజపల్లి వీరన్న, నాయకులు ఊడుగుల రాములు, సెగ్గం యాకయ్య, బంగారు శ్రీనివాస్, సత్యం, పూర్ణ, శ్రీను, క్రిష్ణ, జానీ, నారాయణరెడ్డి, నాయకులు జోగా రాములు, పూనెం రవి, జజ్జర సురేష్, సమ్మయ్య, పార్వతి,ఊడుగుల రాములు, బంగారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో ప్రభుత్వాలు విఫలం

- నూకల ఉపేందర్‌యాదవ్



మాట్లాడుతున్న నూకల ఉపేందర్

గూడూరు: రైతాంగానికి అవసరమైన యూరియా సరఫరా చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఎంసీపీఐ (యు) జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్‌యాదవ్ ఆరోపించారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజా సంక్షేమ పాలన అందించడంలో విఫలమవుతూ కేంద్ర, రాష్ట్ర పాలకులు ఒకరిపై ఒకరు విమర్శించుకుంటూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నా రు. యూరియా సరఫరా చేయడంలో వెనకబడ్డారన్నారు. ప్రధాని మోదీ తెలంగాణపై సవతితల్లి ప్రేమ చూపుతున్నారని ఆరోపించారు. వీరస్వామి పాల్గొన్నారు.

యూరియా అందజేయాలి

గార్ల: రైతులకు సరిపడా యూరియా ఇవ్వాలని న్యూడెమోక్రసీ పార్టీ మండల కార్యదర్శి సక్రు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం గార్ల పీఏసీఎస్ కార్యాలయంలో కొనసాగుతున్న యూరియా పంపిణీ కార్యక్రమాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. ఏజెన్సీలో గిరిజనేతర రైతులకు పాత భూమి ఆధార పత్రాలతో వారికి యూరియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాన్యా, మాధవరావు, హనుమంతు, శంకర్, హరి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

డోర్నకల్/గార్ల: రాష్ట్రప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో చేపట్టిన జీపు జాతా గురువారం డోర్నకల్, గార్లలో కొనసాగింది. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు గందసిరి జ్యోతి, బాసుపట్ల మధు మాట్లాడారు. డోర్నకల్‌లో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు. పాకాల ఏటిపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టక పోవడంతో రాంపురం, మద్దివంచ పంచాయతీల గ్రామాల విద్యార్థులు చదువులకు దూరం అవుతున్నారని పేర్కొన్నారు. నాయకులు ఎండీ అమీర్, గుండ్ల రాకేష్, కొడవండ్ల ఉదయ్, కల్యాణి, ఆకాష్, శృతి, అమీర్, రాకేష్, పాల్గొనగా.. అలువాల సత్యవతి మద్దతు ప్రకటించారు.

కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ నిలిపేయాలి

కురవి: ఛత్తీస్‌గఢ్‌లో కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట ఉద్యమకారులు, అడవి బిడ్డలను చంపుతుందని వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని గిరిజన చైతన్య వేదిక వ్యవస్థాపకుడు గుగులోత్ కిషన్ నాయక్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఈనెల 24న వరంగల్‌లో జరిగే బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ బీమానాయక్, అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సామేలు, రాందాస్‌నాయక్, శ్రీనునాయక్ పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

తొర్రూరు: ఆపరేషన్ కగార్ తక్షణమే నిలిపివేయాలని న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి ఆలకుంట్ల సాయిలు, మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్నలు కోరారు. ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని వామపక్షాల ఆధ్వర్యంలో ఈ నెల 24న హనుమకొండలో జరిగే సభ పోస్టర్లను గురువారం తొర్రూరులో ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రం ఆదివాసీల హక్కులను కాలరాస్తోందన్నారు. భిక్షపతి, సాయిలు, నరసింహచారి, రాములు, మల్లయ్య పాల్గొన్నారు.

పుస్తకాల అందజేత



పుస్తకాలు పంపిణీ చేస్తున్న దాతలు

మహబూబాబాద్ రూరల్/ కురవి: మహబూబాబాద్ మండలంలోని అమనగల్ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో, మండలంలోని మోద్గులగూడెం జెడ్పీ హైస్కూల్‌లో స్ఫూర్తి ఎడ్యుకేషనల్, రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ తెలుగు సేవా సమితి ఆఫ్ నేబ్రాస్కా ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ పుస్తకాలు అందజేశారు. స్ఫూర్తి ఎడ్యుకేషన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రామసహాయం శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. పేద పిల్లలకు అన్ని రకాలుగా సహకారం అందించాలనే ఉద్దేశంతో పుస్తకాలు అందించినట్లు తెలిపారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇంటర్మీడియట్ వరకు ప్రతి సంవత్సరం రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ వస్తుందన్నారు. ఇన్‌చార్జ్ హెచ్‌ఎంలు ఫహీం, సత్యనారాయణచారి, మేకల కృష్ణయ్య, వీరశెట్టి వినోద్, దుర్గయ్య, జనార్దన్, శౌధర్, రాధిక, భరత్ కుమార్, సలీం, రమేష్, శ్రీరాములు పాల్గొన్నారు.

రేపు మహాధర్నా

మహబూబాబాద్ అర్బన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 23న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నాను జయప్రదం చేయలని ఐక్య ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ సభ్యులు కవిత, మల్లారెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని జేడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాలలో కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు.

కురవి సంతలో యూరియా కోసం బారులుదీరిన మహిళా రైతులు



బస్తా దొరికేనా..

యూరియా కోసం నిరీక్షిస్తున్న రైతులకు కొన్నిప్రాంతాల్లో నిరాశే ఎదురవుతోంది. రోజంతా క్యూలో ఉన్నా.. యూరియా బస్తా దొరుకుతుందో లేదోనని అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. గురువారం జిల్లా వ్యాప్తంగా రైతులు యూరియా కోసం సొసైటీల ఎదుట ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



దంతాలపల్లి: యూరియా పంపిణీ చేస్తున్న తహసీల్దార్, వ్యవసాయ అధికారులు, పోలీసులు



మరిపెడ రూరల్: ఎల్లంపేటలో రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ కవిత



కురవి: బస్తాను మోస్తున్న ఆర్‌ఐ



బయ్యారం: గంధంపల్లి-కొత్తపేటలో యూరియా కోసం వచ్చిన రైతులు

న్యూడెమోక్రసీలో బహిష్కరణల పర్వం

బయ్యారం:న్యూడెమోక్రసీ (చంద్రన్న వర్గం)లో బహిష్కరణల పర్వం రచ్చకెక్కింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న అశోక్‌ను కేంద్ర కమిటీ కార్యదర్శి పెద్దచంద్రన్న బహిష్కరిస్తున్నట్లు ప్రకటించగా అశోక్ కేంద్ర కమిటీ కార్యదర్శి పెద్దచంద్రన్నను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర కార్యదర్శిస్థాయిలో అశోక్ విప్లవస్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తూ రహస్య జీవితానికి దూరంగా ఉంటున్నారని పెద్ద చంద్రన్న పేరున గురువారం ప్రకటన చేశారు. పార్టీ నాయకత్వంపై నిందారోపణలు చేయటంతో అశోక్‌ను బహిష్కరిస్తున్నట్లు చంద్రన్న పేర్కొన్నారు.

చంద్రన్నను బహిష్కరిస్తున్నాం: అశోక్

అక్రమాస్తులు సంపాదించినందుకు కేంద్ర కమిటీ కార్యదర్శి చంద్రన్నను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి, కేంద్ర కమిటీ సభ్యులు అశోక్ గురువారం ప్రకటన పేర్కొన్నారు. చంద్రన్న చేస్తున్న ప్రైవేట్ వ్యవహారాలను ప్రశ్నించినందుకు నాయకులు, కార్యకర్తలను రాజకీయంగా, ఆర్థికంగా, మానసికంగా వేధిస్తున్నందున చంద్రన్నను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం

- పెండ్లి రఘువీరరెడ్డి

మరిపెడ రూరల్: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని కాంగ్రెస్ పార్టీ మరిపెడ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరరెడ్డి అన్నారు. పల్లె ప్రగతి యాత్రలో భాగంగా గురువారం మండలంలోని ఆనెపురం, బావోజిగూడెం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పల్లె ప్రగతి యాత్ర చేపట్టారు. ముందుగా ఆనెపురం కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు మల్లికంటి యాకన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో రఘువీరరెడ్డి మాట్లాడారు. అనంతరం పల్లె ప్రగతిలో భాగంగా స్థానిక పాఠశాల ఆవరణంలో ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు వంటికొమ్ము యుగేందర్‌రెడ్డి, గుగులోతు రవినాయక్, మల్లికంటి యాకన్న, అఫ్జల్, వేణు, పఠాన్ మక్బూల్ ఖాన్, వెంకన్న, నవీన్, వీరన్న, శరత్ పాల్గొన్నారు.

తండాలో ఇందిరమ్మ యాత్ర

డోర్నకల్: మండలంలోని తెల్లబండతండాలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ పల్లె ప్రగతి యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్ కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో మండల, గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

వాటర్ ప్లాంట్ ప్రారంభం

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర కళాశాల హాస్టల్‌లో మినరల్ వాటర్ ప్లాంట్‌ను హాస్టల్ వార్డెన్ తిరుమలరావు గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్సీ హాస్టల్స్ వార్డెన్లు పాలకుర్తి మధు, శ్రీనివాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టీషర్టుల పంపిణీ

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని సింగారం ఎంపీ యూపీఎస్‌లో సింగారం గ్రామ వాస్తవ్యులు నెలకుర్తి మోహన్ రెడ్డి విద్యార్థులకు టీషర్టులను గురువారం బహూకరించారు. పాఠశాల ఏఏపీసీ చైర్మన్ కొత్త లలిత తమ కుమారుడు కొత్త సందీప్ రెడ్డి జ్ఞాపకార్థం తరగతి గదులకు చిత్రాలు వేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వినయ్ కుమార్, ఉపాధ్యాయులు నరేష్, శ్రీనివాస్, సబిత, సునీత, గ్రామస్తులు దొంతరబోయిన నరేష్, దర్శనం లక్ష్మణ్, కోడి వేణు, మట్టగజం యాకన్న, సుధాకర్, రామన్న పాల్గొన్నారు.

ఎంపిక

దంతాలపల్లి: ధూప, దీప నైవేద్య అర్చక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండలంలోని పెద్ద ముప్పారం గ్రామానికి చెందిన అర్చకులు పాలంపల్లి రమణశర్మ ఎంపికయ్యారు. గురువారం రమణశర్మ మాట్లాడుతూ.. బుధవారం తొర్రూరు మండల కేంద్రంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమాచార్యులు ఎంపిక చేసినట్లు రమణశర్మ వెల్లడించారు.

ఆత్మహత్య

గూడూరు: వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని జగన్నాయకులగూడెంలో గురువారం జరిగింది. ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఈసం రవి (35) అనారోగ్య కారణాలతో కొంతకాలంగా మనోవేదన చెందుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం పురుగుల మందు తాగగా, కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

గూడూరు: మండల కేంద్రంలోని సనాతన శివాలయంలో గురువారం శ్రావణమాస మాసశివ రాత్రిని పురస్కరించుకొని శివపార్వతుల కల్యాణ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకల్లో లయ చైర్మన్ డాక్టర్ ఏపూరు రవీందర్‌రెడ్డి, గూడూరు సీఐ జి. సూర్యప్రకాశ్‌లతోపాటు భక్తులు శివపార్వతుల విగ్రహాలకు పంచామృత అభిషేకం చేశారు. అనంతరం లఘు కల్యాణాన్ని ఆలయ పూజారి భానూప్రకాశ్‌శాస్త్రి, సతీష్‌పాండ్యే బృందం కనుల పండువలా జరిపించారు.

విరిగిపడిన విద్యుత్ స్తంభం



నెల్లికుదురు: మండలంలోని మేచరాజుపల్లి గ్రామ ప్రధాన రహదారిపై గురువారం మధ్యాహ్నం విద్యుత్ స్తంభం విరిగిపడింది. రోడ్డుపై నడుస్తున్న వారు తృటిలో ప్రాణాలతో తప్పించుకున్నారని స్థానికులు తెలిపారు. గ్రామంలో విద్యుత్ స్తంభాలు శిథిలావస్థలో ఉన్నాయని, కొన్నింటికి విద్యుత్ షాక్ వస్తుందని పలుమార్లు విన్నవించినా పట్టించుకునే వారు కరువయ్యారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పరామర్శ

మరిపెడ రూరల్: మరిపెడ మండలం గుండెపుడి గ్రామానికి చెందిన గడ్డం గోపమ్మ (80) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ బాధిత కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు.

కురవి: మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి) శివారు పెద్ద తండాలో మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ చిన్నమ్మ గుగులోత్ భూరమ్మ బుధవారం మృతి చెందింది. ఈ మేరకు సత్యవతిరాథోడ్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత గురువారం భూరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, రంజాన్, శ్రీనివాస్, ఉపేందర్, పాల్గొన్నారు.

బైండోవర్ అన్యాయం

కేసముద్రం: పట్టాదారు పాసుపుస్తకాల కోసం కలెక్టరేట్ ఎదుట బుధవారం శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేశామని, ఇందుకు తనను అన్యాయంగా కేసముద్రం తహసీల్దార్ ఎదుట పోలీసులు బైండోవర్ చేశారని మండలంలోని నారాయణపురం మాజీ ఎంపీటీసీ, రైతు దారావత్ రవినాయక్ ఆరోపించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో రవినాయక్‌ను బైండోవర్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

ఆలయం ప్రారంభం

మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని లక్ష్మీపురం తండా జీపీ పరిధిలోని బడితండాలో నూతనంగా నిర్మించిన సమ్మక్క, సారలమ్మ గద్దెలు, ఆలయ ప్రారంభోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. స్థానికులు భూక్య శారద, సీతారాం దంపతుల ఆధ్వర్యంలో నిర్మాణం జరిగిన ఈ వేడుకకు బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోత్ కవిత పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పూజారి సురేష్ చౌదరిరాణి, పర్కాల శ్రీనివాసరెడ్డి, యాళ్ల మురళీధర్‌రెడ్డి, ఎండీ.షఫియుద్దీన్, వెంకన్న, మహేష్, సంపత్, వెంకటేష్, బిల్లునాయక్, బాలు, భావ్ సింగ్, చంద్రయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

మహా నాయకున్ని కోల్పోయాం



నెల్లికుదురు: మహా నాయకున్ని కోల్పోయామని సీతారాంరెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బంజర గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన కామ్రేడ్ నెలకుర్తి సీతారాంరెడ్డి పార్థివదేహానికి స్థానిక నాయకులతో కలసి పూలమాలతోపాటు ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు తోపాటు పులువురు నాయకులు సందర్శించారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



విద్యార్థుల పఠన సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వేణుమాధవ్

పెద్దవంగర: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీఓ వేణుమాధవ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామంలో ఆయన పర్యటించి జెడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంతో పాటు పల్లె దవాఖానను సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు, బోధన విధానం, పాఠశాలల శుభ్రత, సౌకర్యాలు, అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న ఆహారం, ఆరోగ్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

దొంగతనం కేసులో ఇద్దరి అరెస్టు

నెల్లికుదురు: దొంగతనం కేసులో ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చిర్ర రమేశ్‌బాబు గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రావిరాల గ్రామానికి చెందిన అక్కిర పూలమ్మ ఇంటి తాళాన్ని దుండగులు పగులగొట్టి.. బీరువాలోని 3తులాల బంగారు, 25 తులాల వెండి ఆభరణాలు, రూ.50వేలు నగదు ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మూడు రోజుల్లోనే ఛేదించారు. అదే గ్రామానికి చెందిన నిందితులు కూతాటి సురేష్, రాగి పాపయ్యను పట్టుకుని బంగారం, వెండి, నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.